సాక్షి పల్నాడు

సోమవారం । 2 । జనవరి । 2023



పులిచింతల నీటి నిల్వ


అచ్చంపేట: పులిచింతల ప్రస్తుత నీటి నిల్వ 44.7433 టీఎంసీలు. ఎగువ నుంచి 2,000 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 2,200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 1,016 క్యూసెక్కులు వదిలారు. ప్రస్తుతం బ్యారేజ్ వద్ద 5,029 క్యూసెక్కులు నిల్వఉంది.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఒక్క కరోనా పాజిటివ్ కేసు కూడా నమోదు కాలేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.



తొలిసారి పింఛన్ అందుకున్న ఆనందంలో లబ్ధిదారులు



పింఛన్‌లను అందజేస్తున్న ఎమ్మెల్సీలు డొక్కా, లేళ్ల, ఎమ్మెల్యే మద్దాళి



పింఛన్ నగదు అందజేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

నూతన శుభవేళ

నూతన సంవత్సరం ప్రారంభ రోజే పెన్షన్ కానుక తలుపుతట్టింది. వలంటీర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు సంతోషాలు పంచిపెట్టారు. ఇచ్చిన మాట మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ సొమ్మును రూ.2,500 నుంచి రూ.2,750కు పెంచి చేతికందించారు. కొత్త సంవత్సరం వేళ పెంచిన పింఛన్ సొమ్ము చేతికందడంతో లబ్ధిదారులు గుండెల నిండా ఆనందంతో ఆశీర్వదించారు. - సాక్షి, నెట్‌వర్క్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదివారం తాడేపల్లిలోని నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

న్యూస్‌రీల్

లబ్ధిదారులందరికీ పింఛన్ అందజేయాలి

జిల్లాలో పింఛన్ పంపిణీ ప్రారంభించిన కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: జిల్లాలో ఈ నెల 7వ తేదీ వరకు పెన్షన్ వారోత్సవాలు నిర్వహించి ప్రతి లబ్ధిదారుడికి పింఛన్ అందజేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లో పలువురు లబ్ధిదారులకు పింఛన్ అందజేసి జిల్లాలో పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2,31,220 పింఛన్‌దారులకు రూ.2,750 చొప్పున నిధులు మంజూరయ్యాయన్నారు. జిల్లాలో నూతనంగా 8,818 మందికి ప్రభుత్వం పెన్షన్‌లు మంజూరు చేసిందని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లు తగు జాగ్రత్తలు తీసుకొని ప్రజాప్రతినిధుల సహకారంతో పింఛన్ సొమ్ము పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్ పాల్గొన్నారు.

గుంటూరు రేంజ్ డీఐజీకి ఐజీగా ఉద్యోగోన్నతి



నగరంపాలెం: గుంటూరు రేంజ్ డీఐజీ డాక్టర్ సీఎం త్రివిక్రమవర్మ ఐజీగా ఉద్యోగోన్నతి పొందారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఐపీఎస్‌లకు ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ మేరకు గుంటూరు నగరంలోని ఆయన కార్యాలయంలో ఆదివారం ఐజీగా బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్, పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్, ప్రకాశం జిల్లా మల్లికాఖర్గే ఐజీని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛాలు అందించారు.

మద్యం కేసులో డిఫెన్స్ ఉద్యోగి అరెస్ట్

సాక్షి ఎఫెక్ట్

బాపట్లటౌన్: ఓ వైపు ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ఉద్యోగం చేస్తూ మరో వైపు అక్రమ మద్యం వ్యాపారానికి తెరతీసిన డిఫెన్స్ ఉద్యోగి షఫీ ఎట్టకేలకు కటకటాల పాలయ్యాడు. ఈ నెల 22న పట్టణంలోని రైలుపేటలో ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి షఫీ నివాసం ఉంటున్న ఇంటిపై సెబ్ అధికారులు దాడులు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసుతో సంబంధం ఉన్న వ్యక్తిపై కేసు నమోదు చేయని విషయాన్ని సాక్షి వెలుగులోకి తెచ్చింది. ఈ విషయంపై ఈ నెల 23న సాక్షి దినపత్రిలో 'మద్యం కేసులో మిలాఖత్' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి జిల్లా పోలీస్ అధికారులు స్పందించారు. మద్యం కేసుతో సంబంధం ఉన్న వ్యక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సెబ్ అధికారులను ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో సెబ్ అధికారులు తప్పని పరిస్థితిలో డిఫెన్స్ ఉద్యోగి షఫీని అరెస్ట్ చేసి జైలుకు పంపారు. అక్రమ మద్యం కేసులో మిలాఖత్ అయిన సదరు సెబ్ ఉద్యోగిపై విచారణ కొనసాగుతోంది.

సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం ఆదివారం 580.00 అడుగుల వద్ద ఉంది. ఇది 283.0160 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 8,529, ఎడమ కాలువకు 8,718, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరద కాలువకు 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 19,447 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 19,447 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 857.00 అడుగుల వద్ద ఉంది. ఇది 97.1760 టీఎంసీలకు సమానం.

నారా నరమేధం



ప్రమాద ఘటనా స్థలం

• రాజకీయ బలిపీఠం • సమిధలైన పేదలు • చంద్రన్న కానుకల పేరిట ప్రచారయావ పరాకాష్టకు • ముగ్గురు అబలల ప్రాణాలు బలి

కొత్త సంవత్సర వేళ.. దుష్ట రాజకీయం వికటాట్టహాసం చేసింది. పదవీ కాంక్షతో ప్రజల ప్రాణాలను బలితీసుకుంది. ప్రచార యావతో అబలలను మరణశయ్యపైకి చేర్చింది. రెక్కాడితేగానీ డొక్కాడని బక్క జీవులకు కానుకల ఆశ చూపి ధృతరాష్ట్ర కౌగిలిలా ఉక్కిరిబిక్కిరి చేసింది. మహిళామణులను పొట్టనపెట్టుకుంది. పేద కుటుంబాలను తీరని విషాదంలోకి నెట్టింది.

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): పేద కుటుంబాల్లో కొత్త సంవత్సరం రోజున చంద్రబాబు నాయుడు ప్రచార యావ విషాదాన్ని నింపింది. మరోసారి టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పర్యటన ఎన్నో కుటుంబాల్లో కన్నీరు మిగిల్చింది. గుంటూరు నగరంలో ఉయ్యూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వికాస్‌నగర్‌లో అన్నగారి జనతా వస్త్రాలు, చంద్రన్న సంక్రాంతి కానుక కిట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. పది రోజుల నుంచి గుంటూరు నగరంతో పాటు రూరల్ ప్రాంతాల్లో కానుకల పంపిణీపై విస్తృత ప్రచారం చేశారు. చంద్రన్న కానుకలకు పెద్ద ఎత్తున తరలిరావాలని నగరంలోని ఆయా డివిజన్‌లలో టీడీపీ నేతలు, ఫౌండేషన్ సభ్యులు తిరిగి మహిళల నుంచి ఆధార్ కార్డులు సేకరించి, 10 వేల టోకెన్లు కిట్‌ల కోసం అందజేశారు. అయితే టోకెన్‌లు లేకపోయినా చీరలు, నిత్యావసరాల కిట్‌లు పంపిణీ చేస్తారని చెప్పి సుమారు 25 వేల నుంచి 30 వేల మంది మహిళలకు ఆశ చూపి తరలించారు.

సేవా వేదికని చెప్పి.. రాజకీయ సభలా..

ఉదయం 12 గంటల నుంచే మహిళలను సభా ప్రాంగణానికి తరలించడం మొదలుపెట్టారు. అదిగో బాబు వస్తున్నాడంటూ సాయంత్రం వరకు అక్కడ బ్యారికేడ్లు కట్టి కూర్చోబెట్టారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ ఎటువంటి టెంట్లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో వృద్ధ మహిళలు, బాలింతలు బాధపడుతూ కూర్చోవాల్సివచ్చింది. ఈ క్రమంలో సాయంత్రం 5 గంటలకు చంద్రబాబు సభా స్థలికి చేరుకునేటప్పటికీ కనీసం ఏ ఒక్కరికీ కానుక ఇచ్చిన పాపాన పోలేదు. అక్కడకు చేరుకున్న చంద్రబాబు సుమారు గంటకుపైగా ప్రసంగం చేశారు. 6 గంటల 10 నిమిషాలకు చంద్రబాబు కార్యక్రమం ముగించుకుని వెళ్లిన క్రమంలో ఒక్కసారిగా పంపిణీ కార్యక్రమం మొదలుపెట్టారు. మహిళలు కదలకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేసిన ఫౌండేషన్ సభ్యులు, టీడీపీ నేతలు కానుకలు పంపిణీ సమయంలో ఎటువంటి రక్షణ ఏర్పాట్లు చేయలేదు. ఒక్కసారిగా కానుకల కోసం మహిళలు పరుగులు తీయడంతో పరిస్థితి తోపులాటకు దారితీసింది. బ్యారికేడ్లు నెట్టుకుని ముందుకు వెళ్తున్న సమయంలో ఒకరిపై ఒకరు పడటంతో తిరిగి లేవలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఊపిరి ఆడక ముగ్గురు మహిళలు మృత్యుఒడికి చేరారు. ఒకరు అక్కడికక్కడే తనువుచాలించగా, మరో ఇద్దరు ఆస్పత్రిలో ప్రాణాలు వదిలారు. 17 మంది తీవ్ర గాయాలపాలయ్యారు.

ఊపిరి అందక.. విగతజీవులై..

కందుకూరు దుర్ఘటన మరువక ముందే, గుంటూరు సంఘటన చంద్రబాబు ప్రచార పిచ్చికి పరాకాష్ట అని మరోసారి నిరూపించింది. నిండు ప్రాణాలను సభల పేరుతో బలితీసుకుంటున్నారు. తొక్కిసలాటలో గుంటూరు నగరం కన్నావారితోటకు చెందిన సయ్యద్ ఆసియా (48), ఏటీ అగ్రహారానికి చెందిన గోపిదేశి రమాదేవి (50), నల్లచెరువుకు చెందిన షేక్ మస్తాన్‌బీ (55) ఊపిరి ఆడని పరిస్థితుల్లో మృతి చెందారు. శ్రీనివాసరావుపేటకు చెందిన షేక్ రజియా, నల్లచెరువుకు చెందిన మస్తాన్‌బీ, శ్రీకృష్ణదేవరాయనగర్‌కు చెందిన ప్రసాదం సీతామహాలక్ష్మి, తుఫాన్‌నగర్‌కు చెందిన తెల్లమేకల మంగమ్మ, తెల్లమేకల రంగమ్మ, కమాదుల సరోజిని, చుట్టుగుంటకు చెందిన పెందుర్తి ప్రియాంక, సీతమ్మ కాలనీకి చెందిన ఎస్.భూలక్ష్మి, అరండల్‌పేటకు చెందిన హిమబిందు ఉమాదేవి, ఏటీ అగ్రహారానికి చెందిన హుస్సేన్‌బీ, నిర్మల, స్వర్ణభారతినగర్‌కు చెందిన గుంటముక్కల సౌందర్య, జానా దుర్గ, నగరంపాలేనికి చెందిన పఠాన్ ఆస్మ, పెందుర్తి మేరీ, సువార్త, బత్తుల లక్ష్మమ్మ తీవ్రంగా గాయపడ్డారు.

మిన్నంటిన రోదనలు..

ముగ్గురు మహిళలు మృతి చెందడం, పదిహేడు మంది వరకు గాయపడటంతో వారిలో కొంత మందిని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీంతో మృతుల బంధువులు, గాయపడిన వారి కుటుంబ సభ్యులు జీజీహెచ్‌కు చేరుకోవడంతో విషాద వాతావరణం నెలకొంది. బాధితులు, వారి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. గాయపడినవారిని ఆటోలు, కార్లు డిక్కీలో పెట్టి తీసుకుని రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆఖరికి స్థానికులు పలువురు బైక్‌లపైనే తీసుకునివచ్చారు.

ఇదేమి ఖర్మ బాబూ..

గుంటూరు నగరం, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అనేక మంది పేద మహిళలను డబ్బులు ఇస్తామని, కిట్లు ఇస్తామని ఆశ చూపి సభకు తరలించారు. సభ ఆద్యంతం కేవలం రాజకీయ సభను తలపించింది. దీంతో అనేక మంది మహిళలు అక్కడ నుంచి వెనుదిరిగిన పరిస్థితులు తారసపడ్డాయి. కేవలం చంద్రబాబు ప్రసంగం కోసమే ఉయ్యూరు ట్రస్ట్ ఎండీ ఉయ్యూరు శ్రీనివాస్ ఏర్పాటు చేసినట్లు కనిపించింది. చీరలు సైతం ఎందుకు పనికిరావని మహిళలు వాపోయిన పరిస్థితులు ఉన్నాయి. ఈ మాత్రం దానికి మా ప్రాణాలు బలిగొన్నారని, సరుకులు ఇస్తామంటే మహిళలను పోగుచేశామని, టీడీపీకి చెందిన మహిళా నేతలే బాహాటంగానే విమర్శలు చేశారు.



రమాదేవి మృతదేహం వద్ద కన్నీరు మున్నీరవుతున్న కుటుంబ సభ్యులు



ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

ప్రమాద స్థలిని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

గుంటూరు రూరల్: గుంటూరు వికాస్ నగర్‌లో ఆదివారం రాత్రి ఉయ్యూరు ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కానుకల పంపిణీలో జరిగిన తొక్కిసలాట ఘటన స్థలాన్ని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ ఆరీఫ్‌హఫీజ్‌తో కలిసి పరిశీలించారు. ఘటన జరిగిన తీరు, పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారిని చికిత్స కోసం వెంటనే ఆస్పత్రులకు తరలించేలా ఆదేశాలు జారీ చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ వైద్యులను ఆదేశించారు.

ముందుగానే హెచ్చరించాం

సభా ప్రాంగణం సామర్థ్యానికి మించి మహిళలను అధికంగా తరలించారు. నిత్యావసర సరుకుల పంపిణీ వద్ద బారికేడ్లు ఇరుకుగా ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు పడతారని పోలీసులు ముందుగానే హెచ్చరించారు. టీడీపీ వలంటీర్లు పర్వాలేదు, తామంతా చూసుకుంటామని తెలిపారు. అయినప్పటికీ 200 మంది పోలీసు సిబ్బందిని ప్రాంగణం బందోబస్తు విధుల్లో ఉంచాం. ప్రమాదాన్ని ముందుగానే గమనించి పోలీసులు 1 నుంచి 4 కౌంటర్ల వద్ద తొక్కిసలాటలో కిందపడిన మహిళలు, వృద్ధులను పక్కకు తీసుకొచ్చి సపర్యలు చేశారు. మంచి నీరు తాగించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ డివిజన్ అధికారి ప్రభాకర్‌రెడ్డి, పశ్చిమ మండల తహసీల్దారు సాంబశివరావు పాల్గొన్నారు.

- ఎస్పీ ఆరీఫ్ హఫీజ్



బోరున విలపిస్తున్న రమాదేవి కుటుంబ సభ్యులు



గాయాలపాలైన మహిళను 108లో ఆసుపత్రికి తీసుకెళ్తున్న దృశ్యం

నేను త్రుటిలో తప్పించుకున్నాను



మా అమ్మ తెల్లమేకల మంగమ్మ తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడింది. నేను త్రుటిలో తప్పించుకున్నాను. వేలాది మందిని పిలిచి కొద్ది కానుకలే అందుబాటులో ఉంచేటప్పటికీ తీవ్ర తొక్కిసలాట జరిగింది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బయటపడ్డాం. పేద ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే ఎలా?.

- శివపార్వతి, తుఫాన్‌నగర్

సరుకుల ఆశ చూపి తెచ్చారు



సరుకులు ఇస్తామని ఆశ చూపారు. దీంతో ఇక్కడికి వచ్చి మా సోదరి తొక్కిసలాటలో తీవ్ర ంగా గాయపడింది. ఎటువంటి సరుకులు అందలేదు. కనీసం క్యూలో కూడా నుల్చోలేని పరిస్థితి ఏర్పడింది. టోకెన్లు ఇచ్చిన వారికంటే పది రెట్లు అధికంగా మహిళలు అక్కడకు వచ్చారు. కేవలం కానుకల పేరుతో తప్పుడు ప్రచారం చేసి మా ప్రాణాల మీదకు తీసుకొచ్చారు.

- విద్యశ్రీ, చుట్టుగుంట

సంతోషాలకు స్వాగతం

- సంబరంగా నూతన సంవత్సర వేడుకలు
- పెరిగిన పింఛన్ నగదు పంపిణీ చేసిన వలంటీర్లు
- తొలిరోజు సాయంత్రం 6 గంటలకు జిల్లాలో 64.25 శాతం పింఛన్ నగదు పంపిణీ పూర్తి

సాక్షి, నరసరావుపేట: విద్యుత్ వెలుగులు.. టపాసుల మోతలు.. యువత కేరింతలు.. మహిళల రంగవల్లుల మధ్య కొత్త సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. పల్నాడు జిల్లా అంతటా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి.

2,31,220 మందికి పెరిగిన పింఛన్ నగదు..

దేశమంతా కొత్త సంవత్సర వేడుకలు మాత్రమే జరుగుతుంటే మన రాష్ట్రంలో దానికి తోడు పింఛన్ల పండుగ సైతం జరిగింది. ఈ నెల నుంచి కొత్తగా 8,818 మందికి కొత్తగా పింఛన్‌లు మంజూరు చేశారు. మరోవైపు పింఛన్ నగదును రూ.2500 నుంచి రూ.2750కి పెంచి అందించారు. దీంతో అవ్వాతాతలకు ముందుగానే సంక్రాంతి పండుగ వచ్చినట్లయింది. పల్నాడు జిల్లాలో గత నెల వరకు నెలకు రూ.2,500 పింఛన్ నగదు పొందుతున్న వారు 2,31,220 మంది ఉన్నారు. వీరందరికీ జనవరి నెల నుంచి రూ.250 అదనంగా ప్రభుత్వం చెల్లించనుంది. దీంతో ఆదివారం నుంచి వీరందరికీ రూ.2,750 నగదు పంపిణీని వలంటీర్లు ప్రారంభించారు. జిల్లాలోని అవ్వాతాతలకు ఈ నెల రూ.5,78,05,000 ప్రభుత్వం అదనంగా కేటాయించింది. ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పింఛన్ నగదు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు పెంచుకుంటూ పోతుండటం పట్ల అవ్వాతాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు జిల్లాలో మొత్తం 2,72,601 పింఛన్లు ఉండగా ప్రభుత్వం రూ.75.56 కోట్లను విడుదల చేసింది. అందులో తొలి రోజు సాయంత్రం ఆరు గంటలకు 1,74,348 మంది లబ్ధిదారులకు పంపిణీ పూర్తయింది.



పింఛన్ లబ్ధిదారులతో కలెక్టర్ శివశంకర్

పింఛన్‌ల కోత అంటూ 'పచ్చ' కూతలు..

ప్రతి ఏడాది సాధారణంగా జరిగే పింఛన్ల సామాజిక తనిఖీపై ప్రతిపక్ష పార్టీ, దాని అనుకూల మీడియాలు విపరీత ధోరణిలో అసత్య ప్రచారాలు చేశాయి. లక్షల మందికి నోటీసులు అందజేసి, పింఛన్లు కోత పెడుతున్నారంటూ ప్రచారం చేశారు. వాటన్నింటికి ప్రభుత్వం తన నిబద్ధతతో సమాధానం చెప్పింది. నోటీసు అందుకున్న ఎంతో మందికి జనవరి ఒకటో తేదీన పింఛన్ నగదు ఎప్పటిలాగే తెల్లవారుజామునే వలంటీర్ ఇంటి వద్ద అందజేశారు.

నోటీసు అందజేసినా.. నగదు పంపిణీ

నా పింఛన్ అర్హతపై సందేహం వ్యక్తం చేస్తూ నోటీసు జారీ చేశారు. దీనికి తగిన సమాధానం ఇవ్వడంతో నా పింఛన్ రద్దు కాలేదు. జగనన్న ఇచ్చిన మాట ప్రకారం పెరిగిన పింఛన్ నగదు రూ.2,750లను జనవరి 1వ తేదీ ఉదయమే నా ఇంటి వద్ద వలంటీర్ అందజేశారు.

- హైమావతి, పింఛన్ లబ్ధిదారు, నరసరావుపేట

పింఛన్ దారుల ఆనందం

క్రోసూరు/పిడుగురాళ్ల రూరల్/వినుకొండ/శావల్యాపురం: వైఎస్సార్ పెన్షన్ కానుక ఆదివారం పంపిణీ చేశారు. అవ్వాతాతలకు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రెండో విడత పెన్షన్ పెంపుదల చేసి పంపిణీనికి శ్రీకారం చుట్టారు. ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేసినప్పటికి తెల్లవారుజాము నుంచే జిల్లా వ్యాప్తంగా వలంటీర్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

సంతోషంగా ఉంది



పొలం ఎక్కువ ఉందని పింఛన్ తీసేందుకు నోటీసు ఇచ్చారు. తన పేరున పొలం ఎక్కువగా ఉందని అర్హత లేదని నోటీసు ఇవ్వడంతో తన పొలాన్ని తన పిల్లల పేర మార్చుకుంటానని వివరణ ఇచ్చాను. దీంతో పెన్షన్ యథావిధిగా పెంచిన మొత్తంతో కలపి రూ.2750 అందించారు. సంతోషంగా ఉంది.

–చెరుకూరి హనుమాయమ్మ, క్రోసూరు

పింఛనే జీవనాధారం



నా కుమారుడితో కలసి ఉంటున్నానున. నాకు వచ్చిన ఈ పింఛన్‌తోనే మా కుటుంబం గడుస్తోంది. ఫిట్స్‌తో బాధపడుతున్నా. దీంతో పనులకు వెళ్లలేకపోతున్నా. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నా వితంతువు పింఛన్ వస్తోంది. ప్రస్తుతం రూ.2750కి పెంచారు. మా ఇద్దరి జీవనం సాగిస్తున్నాం.

–ముప్పూరి బాలమ్మ, కామేపల్లి, వితంతు పింఛన్

విద్యుత్ అధికంగా ఉందని..



విద్యుత్ యూనిట్లు అధికంగా వస్తుందని పెన్షన్ తొలగిస్తామన్నారు. నేను వివరణ ఇచ్చిన మీదట యథావిధిగా వృద్ధాప్య పింఛన్ రూ.2750 అందించారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– షేక్ నాగులుమీరా, క్రోసూరు

నా మందులకు పింఛనే ఆధారం



వృద్ధాప్యంతో ఎన్నో రోగాలు వెంటాడుతున్నాయి. పింఛన్ రూ. 2750 రావటం వలన నా మందు బిళ్లలను కొనుగోలు చేస్తున్నా. ఈ పింఛన్ పెంచటం వలన ఎవరిని వద్ద డబ్బులు అడగాల్సిన పని లేదు. నా మందు బిళ్లలకు నా పింఛన్ డబ్బులే సరిపోతున్నాయి.

–ఈమని సాంబిరెడ్డి, బ్రాహ్మణపల్లి

పింఛన్ ఆదుకుంటోంది



నూతన సంవత్సరం రోజున కొత్తగా పింఛన్ తీసుకున్నా. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పెన్షన్ పథకం ఎంతగానో ఆదుకుంటుంది. పింఛను నగదు పెంపుదల చేసిన రూ.2750 చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేతుల మీదగా పంపిణీ చేయటం చాలా ఆనందంగా ఉంది .

ఇసుకేపల్లి కవిత, వినుకొండ

చాలా సంతోషం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మాలాంటి నిరుపేదలకు పింఛను పెంపుదల చేయటం బాగుంది. నాసొంత మనవడిగా నాకు ఆర్థికంగా భరోసా ఇస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. సొంత ఖర్చులకు ఎవరిపై ఆధారపడకుండా ప్రతి నెల ఒకటో తేదీ వలంటీరు ద్వారా నాకు పింఛను నగదు అందుతున్నాయి.

శనివారపు మంగమ్మ, శావల్యాపురం

సంతోషంగా ఉంది



వైఎస్సార్ పెన్షన్ కానుక నగదు ప్రతి నెల అందుతోంది. నా భర్త నాలుగేళ్ల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి వితంతు పెన్షన్ వస్తోంది. ప్రతి నెల వలంటీర్ ఇంటికి తీసుకువచ్చి డబ్బులు ఇస్తున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు బాగున్నాయి.

– షేక్ ఖాశింబి, సత్తెనపల్లి

ఠంఛన్‌గా పింఛన్



నా భర్త తాపీ పని చేస్తుండేవాడు. రెండేళ్ల క్రితం మృతి చెందాడు. రెండేళ్లగా వైఎస్సార్ పింఛన్ కానుక అందుతోంది. పెంచడంతో ఆనందంగా ఉంది. ప్రతి నెల క్రమం తప్పకుండా వలంటీర్ ఇంటికి వచ్చి పింఛను కానుక నగదు అందజేస్తున్నాడు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి కృతజ్ఞతలు.

– ఉప్పుతోళ్ల బాలనాగమ్మ, సత్తెనపల్లి.

నాకు ఆస్తులు లేవు..



పింఛన్‌కు దరఖాస్తు చేసుకోగా మంజూరు చేశారు. అయితే నా ఆధార్‌కు లింక్ ఇబ్బందిగా ఉండడంతో వేరిఫికేషన్ కోసం వలంటీర్లు వచ్చారు. సమస్యను అమరావతి సచివాలయంలో తెలియజేశాను. ధ్రువపత్రం సమర్పించాను. వెంటనే పింఛన్ పునరుద్ధరించి ఆదివారం పింఛన్ వలంటీర్ ఇచ్చారు.

–గుడివాడ సాంబశివరావు, అమరావతి

పింఛన్ ఆదుకుంది



నాకు గతేడాది బ్రెయిన్‌కు పెరాల్‌సిస్ రావటంతో సుమారు ఆరునెలల పాటుగా అస్పత్రిలో చికిత్స పొందాను. వైద్యం కోసం ఎంతో డబ్బు ఖర్చు చేశాం. ఆర్థికంగా ఎంతో ఇబ్బంది పడుతున్నాం. వేడినీళ్లకు చన్నీళ్ల తోడు అన్నట్టుగా కష్టకాలంలో వికలాంగ పింఛన్ కింద రూ.3000 అందించారు. వలంటీర్ ఇంటికొచ్చి దరఖాస్తు పెట్టించి నేడు పెన్షన్ ఇంటికి తెచ్చి ఇవ్వటం ఆనందంగా ఉంది

వోలేటి శ్రీనివాసరావు, అమరావతి

వృద్ధాప్యంలో ఆసరా



వృద్ధాప్యంలో ఖర్చులకు పిల్లల మీద ఆధారపడకుండా పెద్దకొడుకులాగా మమ్మల్ని సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆదుకోవటం ఆనందంగా ఉంది. నెలనెలా మందులకు, ఇతర ఖర్చులకు పింఛన్ 2750 రూపాయలు ఇవ్వటంతో వృద్ధాప్యంలో ఆసరాగా ఉంది

గోరంట్ల వెంకటలక్ష్మి, ఎండ్రాయిగ్రామం, అమరావతి మండలం

ఫ్లోరోసిస్ బాధితులకు అండగా ఉంటాం

- జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్
- 78 మందికి వీల్‌చైర్లు అందజేత



వీల్‌చైర్లు అందుకున్న వారితో జిల్లా కలెక్టర్ శివశంకర్, రెడ్‌క్రాస్, రోటరీక్లబ్ సంస్థల ప్రతినిధులు

నరసరావుపేట: ఫ్లోరోసిస్ బాధితులకు అండగా ఉండటం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నడవలేనిస్థితిలో ఉన్నవారికి, ప్రభుత్వ వైద్యశాలలకు 78 వీల్‌చైర్లను ఆదివారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ నూతన సంవత్సరాన్ని ఒక మంచి కార్యక్రమంతో శ్రీకారం చుట్టామన్నారు. ఈ ఏడాది అంతా ఇదే ఉత్సాహంతో పనిచేస్తే మన పల్నాడు జిల్లా అభివృద్ధి సాధ్యమని చెప్పారు. అదే విధంగా జిల్లా రెడ్‌క్రాస్ ఏర్పాటు చేసిన నాటి నుంచి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టిందని, దానిలో భాగంగానే ఈ రోజు ఫ్లోరోసిస్‌తో బాధపడుతున్న వారికి రోటరీక్లబ్ సహకారంతో వీల్‌చైర్స్ అందించడం జరిగిందన్నారు. బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు సహకరించాలని కోరారు. నూతన సంవత్సరం సందర్భంగా కేక్‌ను కట్‌చేసి అందరికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్మోహన్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి డి.వి నాయకం, రెడ్ క్రాస్ గుంటూరు జిల్లా వైస్‌చైర్మన్ రామచంద్రరాజు, రోటరీ 3150 గవర్నర్ తాళ్ల రాజశేఖర్ రెడ్డి, జిల్లా ప్రభుత్వ వైద్యశాలల పర్యవేక్షణాధికారి డాక్టర్ బీవీ రంగారావు, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి జి.శోభారాణి, డాక్టర్ హనుమకుమార్, రెడ్‌క్రాస్ సభ్యులు బత్తుల మురళి, కేఎంఎస్‌వీ శ్రీనివాసగుప్త, డాక్టర్ సృజన పాల్గొన్నారు.

అరుణాచలం పర్యటనకు ప్రత్యేక బస్సు

నరసరావుపేట: అరుణాచలం గిరి ప్రదక్షిణ కోసం వెళ్లే భక్తుల కోసం స్పెషల్ హైటెక్ బస్సు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి ఆదివారం తెలిపారు. బస్సు 4వ తేదీ రాత్రి 10 గంటలకు నరసరావుపేటలో బయలుదేరి శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం, గోల్డెన్ టెంపుల్ దర్శించుకుంటూ అరుణాచలం చేరుకుంటుందని చెప్పారు. భక్తులు గిరిప్రదక్షిణ చేసుకున్న అనంతరం ఆరో తేదీ సాయంత్రం బయలుదేరి నరసరావుపేటకు ఏడో తేదీ ఉదయం నాలుగు గంటలకు చేరుతుందన్నారు. టికెటు ధర ఒకరికి రూ.2750 నిర్ణయించినట్లు చెప్పారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాల కోసం 73828 96041,73828 96038, 99592 25428లను సంప్రదించాలని సూచించారు.

హ్యూమన్ రైట్స్ లీగల్ కార్యదర్శిగా శ్రీనివాసరావు



నరసరావుపేట ఈస్ట్: నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ పల్నాడు జిల్లా లీగల్ కార్యదర్శిగా పట్టణానికి చెందిన సిహెచ్.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈమేరకు కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పాలక సంపత్ కుమార్ నియామక ఉత్తర్వులు అందచేసినట్లు శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానవ హక్కుల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

అర్హతే ప్రామాణికంగా పింఛన్ల మంజూరు

మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: అర్హతే ప్రామాణికంగా కులం, మతం, వర్గం, పార్టీ అనే వివక్ష లేకుండా ప్రభుత్వం సామాజిక పింఛన్లను మంజూరు చేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని గాంధీపేటలో ఆదివారం మంత్రి పింఛన్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ అర్హత ఉంటే చాలు ప్రతి ఒక్కరికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కొత్త పింఛన్లు మంజూరు అవుతున్నాయని చెప్పారు. ఈ నెల నుంచి రూ.2,750కు పింఛన్‌ను పెంచిన ఘనత కూడా జగనన్నకే దక్కుతోందని వివరించారు. పింఛన్లకు పెంపుదల వలన ప్రభుత్వంపై అదనంగా రూ.1.765 కోట్ల భారం పడుతున్నా అవ్వాతాతలు, అన్నార్తులు జీవితాల్లో వెలుగులు నింపేందుకే ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఒకటో తేదీ వస్తే ఆదివారమైనా, సెలవుదినమైనా పొద్దున్నే తలుపు తట్టి లబ్ధిదారుల గడప వద్దకే వచ్చి పింఛన్లను అందజేస్తున్నారని వివరించారు. అదే గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వృద్ధులు, వికలాంగులు గంటలు, రోజుల తరబడి క్యూలలో పింఛన్ల కోసం నిలబడి ఉండాల్సిన దుస్థితి ఉండేదని గుర్తు చేశారు. అది కూడా పింఛన్ మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీలకు లంచాలు ఇవ్వడంతో పాటు, పచ్చకండువాలు కప్పుకోవాల్సిన పరిస్థితి ఉండేదని విమర్శించారు. నాడు పింఛన్ అడిగితే మీరు ఏ పార్టీ, ఏ వర్గం అంటూ టీడీపీ నాయకులు వృద్ధులను సైతం వేధించేవారని ఆరోపించారు. అలాంటి పరిస్థితికి భిన్నంగా సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా పింఛన్లు అందిస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానిదే అన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గంలోనే నూతనంగా 1,168 పింఛన్లు మంజూరు అయినట్లు తెలిపారు.

వైభవంగా మరియమాత మాతృత్వ మహోత్సవం



వాక్యోపదేశం చేస్తున్న విచారణ గురువులు బాలస్వామి

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని బాల ఏసుదేవాలయంలో వైభవంగా మరియమాత మాతృత్వ దినోత్సవం, మరియు బాల ఏసు నామకరణ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన దివ్యపూజాబలిలో విచారణ గురువులు పామిశెట్టి బాలస్వామి వాక్యోపదేశం చేశారు. ఈ రోజు శుభదినమని మరియమాత మాతృత్వ దినోత్సవం, మరియు దైవకుమారుడికి నామకరణం నిర్వహించిన రోజని చెప్పారు. నూతన సంవత్సరం నూతనత్వాన్ని పెంపొందించుకోవాలంటే గడిచిన రోజులను ప్రతి ఒక్కరూ మననం చేసుకోవాలని కోరారు. మనం ఏవిధంగా జీవించామో, ఎటువంటి పాపాలు చేశామో గుర్తుంచుకొని అటువంటివి ముందు ముందు చేయకుండా ఉండేలా మారు మనసు పొంది నూతన జీవితాలను ఆపాదించుకోవాలని క్రీస్తు ప్రబోధించారని చెప్పారు. తల్లి భగవంతుని కుమారిడికి జన్మనిచ్చి మాతృత్వాన్ని మరియమాత పొందిన రోజుగా గుర్తుంచుకోవాలన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను చూసి భయపడకుండా కోపాలు, ద్వేషాలు విడనాడి భక్తిమార్గంలో క్రీస్తు చూపిన మార్గంలో ప్రయాణించాలని సూచించారు. అనంతరం దివ్యపూజాబలి నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ విచారణగురువు చొప్పర కిషోర్ బాబు పాల్గొన్నారు.

పెన్షన్ కానుకపై ప్రతిపక్షాల విమర్శలు తగదు

వైఎస్సార్ సీపీ పల్నాడు అధ్యక్షుడు, ఎమ్మెల్యే పీఆర్కే

మాచర్ల: పేదలను ఆదుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ కానుకపై దుష్ప్రచారం తగదని వైఎస్సార్ సీపీ పల్నాడు అధ్యక్షుడు, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. రెండో విడత పెంచిన పింఛన్‌ను లబ్ధిదారులకు పంపిణీని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రారంభించారు. పీఆర్కే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వృద్ధులు, వితంతువులతో పాటు వివిధ సామాజిక పింఛన్‌లు అందుకున్న ప్రతి ఒక్కరికి ప్రయోజనం కలిగించేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. అందులో భాగంగానే లబ్ధిదారులకు జనవరి 1వ తేదీన రూ.2750ను పింఛన్ పొందే ప్రతి లబ్ధిదారులడి అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి అన్నారు.

జెడ్పీ క్యాంపు కార్యాలయంలో న్యూ ఇయర్ వేడుకలు



జెడ్పీ క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న హెనీ క్రిస్టినా, పక్కన సురేష్‌కుమార్, శ్రీనివాసరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీ క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్, జెడ్పీ సీఈఓ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డెప్యూటీ సీఈఓ వి.సుజాత కేక్ కట్ చేశారు. అనంతరం కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామని చెప్పారు. ఈసందర్భంగా జెడ్పీలో పని చేస్తున్న 4వ తరగతి ఉద్యోగులకు నూతన వస్త్రాలు బహూకరించారు.

ప్రమాదవశాత్తు నీటమునిగి వ్యక్తి మృతి

నరసరావుపేట రూరల్: ప్రమాదవశాత్తు ఎన్ఎస్పీ కాలువలో మునిగి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని రావిపాడులో ఆదివారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. జొన్నలగడ్డ ఎస్సీ కాలనీకి చెందిన గట్టుపల్లి రోశయ్య(62) రావిపాడు సమీపంలోని పంటపొలాల్లో కూలీ పనులకు వెళ్తుంటాడు. ఆదివారం పొలం పనులు ముగించుకుని సమీపంలోని నరసరావుపేట కాలువలో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు వెళ్లి నీటిలోకి జారిపడి మునిగి పోయాడు. సమీపంలోని కూలీలు గమనించి రోశయ్యను బయటకు తీయగా అప్పటికి మృతిచెందాడు. రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి, ఎస్ఐ బాలనాగిరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

మహిళపై దాడిచేసి బంగారం చోరీ

గుంటూరు ఈస్ట్: ఇంట్లోకి ప్రవేశించి ఒంటరిగా ఉన్న మహిళపై దాడి చేసి బంగారు నగలు దోచుకెళ్లిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ భాగ్యరాజు తెలిపిన వివరాలు.. శ్రీనగర్ 7వలైనులో నివసించే మైలా మల్లేశ్వరి ఆదివారం ఇంట్లో ఒంటరిగా ఉంది. గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి మల్లేశ్వరిని కొట్టి బెదిరించి ఆమె మెడలోని బంగారు గొలుసు, బీరువాలోని నగలను దోచుకుని ఉడాయించాడు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తులతో పోటెత్తిన ఇంద్రకీలాద్రి



దుర్గమ్మ దర్శనం కోసం క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కొత్త సంవత్సరం తొలిరోజు ఇంద్రకీలాద్రికి రికార్డు స్థాయిలో భక్తులు తరలివచ్చి దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. అమ్మవారికి నిర్వహించే ఆర్జిత సేవల్లో పాల్గొనేందుకు ఉభయదాతలు, భక్తులతో పాటు వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు సైతం ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. ఉదయం 6 గంటల నుంచే ఇంద్రకీలాద్రి భక్తులతో కిటకిటలాడింది. భక్తుల రద్దీతో నేపథ్యంలో కొండపైకి కార్లు, ఇతర వాహనాలను అనుమతించలేదు. రద్దీతో ఘాట్‌రోడ్డుపై పలు మార్లు ట్రాఫిక్ జామ్ కావడంతో టోల్‌గేట్లను మూసివేశారు. భక్తులు తమ ద్విచక్ర వాహనాలను కనకదుర్గనగర్‌లో నిలుపుకుని మహా మండపం మీదగా కొండపైకి చేరుకున్నారు. కుటుంబ సమేతంగా, కళాశాలలు, హాస్టల్ నుంచి విద్యార్థులు బృందాలుగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

సర్వదర్శనానికి మూడు గంటలు...

అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో మహా మండపం క్యూలైన్లు, ఘాట్‌రోడ్డు క్యూలైన్లు కిటకిటలాడాయి. దీంతో సర్వ దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. రూ. 100, రూ. 300, రూ. 500 టికెట్లు క్యూలైన్లలోనూ భక్తుల రద్దీ కనిపించింది. మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అరగంటసేపు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. అమ్మవారి దర్శనంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు ఎప్పటికప్పుడు క్యూలైన్లను పర్యవేక్షించారు. మధ్యాహ్నం 3 గంటల వరకు అమ్మవారి సన్నిధిలో భక్తుల రద్దీ కొనసాగింది.

కిటకిటలాడిన వెంకటేశ్వరస్వామి ఆలయం



టీటీడీ కల్యాణమండపంలో వెంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి క్యూలైన్లో ఉన్న భక్తులు



దుర్గగుడి అంతరాలయంలో భక్తుల రద్దీ

విజయవాడ కల్చరల్:నూతన సంవత్సరం సందర్భంగా పున్నమ్మతోటలోని వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆదివారం భక్తులతో నిండిపోయింది. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ భక్తులు వందలాదిగా స్వామిని దర్శించుకున్నారు. హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ డి.వెంకటరమణ, ల్యాండ్ అక్విజేషన్ న్యాయమూర్తి టి.వేణుగోపాల్‌తోపాటు నగరానికి చెందిన పలువురు పోలీస్ అధికారులు శ్రీ వారి సేవలో పాల్గొన్నారు. టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు, వివిధ సేవా విభాగం సేవకులు భక్తులకు ఎటువంటి సౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. టీటీడీ ఉపకార్య నిర్వహణ అధికారి వెంకటయ్య, సూపరింటెండెంట్ రామచంద్రరావు పర్యవేక్షించారు. కంచికామకోటి పీఠ పాలిత వెంకటేశ్వర స్వామి దేవాలయం లబ్బీపేటలో నూతన సంవత్సర వేడకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆచార్యులు గోదాదేవి రంగనాథులు తిరుప్పావై పఠించారు.